క్లుప్తంగా

పరామర్శ



భాస్కర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీ జిల్లాలో 20 రోజుల క్రితం హెలికాప్టర్ కూలిన ఘటనలో తీవ్రంగా గాయపడి శస్త్రచికిత్స అనంతరం తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ బావ ముష్టూరు భాస్కర్‌ను గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. బుధవారం హనుమేష్ నగర్‌లోని భాస్కర్ నివాసానికి వెళ్లి అతడి ఆరోగ్య సమాచారంపై వైవీఆర్ ఆరాతీశారు. కార్యక్రమంలో యువ నాయకుడు సిబి.మంజునాథ రెడ్డి పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో ఈనెల 31న పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 7,604 మంది పింఛన్‌దారులు ఉండగా.. రూ.3.41 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉంటే సచివాలయ ఉద్యోగులు పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు. అలాగే కొత్తగా 89 మందికి వితంతు పింఛన్లు మంజూరు కాగా.. వీరికి జూన్ 12న పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలో పింఛన్ లబ్ధిదారులు గమనించి సహకరించాలన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని తీసుకెళ్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాతిగుడి శివాలయం వద్ద అనారోగ్యంతో మృతి చెందిన ఓ అనాథ మహిళ మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. బుధవారం స్థానికుల సమాచారం మేరకు అనాథ మహిళ మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశాన వాటికకు తరలించి అంతిమ సంస్కారాలు చేశారు. కార్యక్రమంలో ఆ నలుగురు సేవాసమితి సభ్యులు ప్రదీప్ ఆచారి, రవీంద్ర, రాజు, రామాంజి, ఆటో వేణు, అంజి తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

పామిడి: పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి సెలవులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుస్తక పఠనం, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, మహాభారత, రామాయణ, నీతికథలను చదివించడం విద్యార్థులకు అలవాటు చేయించాలన్నారు. విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి వెంకటలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోప్ వే ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోట అభివృద్ధి చెందాలంటే రోప్ వే ఏర్పాటు చేయడంతో పాటు హరిత హోటల్‌ను ఏర్పాటు చేయించాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. గుత్తి కోటలో సర్ థామస్ మన్రో జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కోటలో శిథిలావస్థకు చేరుకున్న అన్ని కట్టడాలను పునర్ నిర్మించాలన్నారు. గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు కాశీరావు, సభ్యులు కోటేశ్వరరావు, దేవేంద్ర, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు వేళ.. రైతు డీలా!



- పెట్టుబడి సాయం ఇవ్వని ప్రభుత్వం
- 2024 ఏడాదికి పంగనామాలు పెట్టిన వైనం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో తాడిపత్రి నియోజకవర్గానికి రూ.99 కోట్ల సాయం
- రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- నిరుత్సాహంలో అన్నదాతలు

తాడిపత్రి రూరల్: ఈ ఏడాది నైరుతి పవనాలు కాస్త ముందుగానే జిల్లాను పలకరించాయి. భారీ వర్షాలతో పాటు అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయి. తాడిపత్రి ప్రాంతంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు దుక్కులు సిద్ధం చేసే పని నిమగ్నమయ్యారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు పడుతుండటంతో రైతులు ఆశల సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక పంటల సాగు తరువాయి. పంట సాగుకు సంబంధించిన పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గతంలో రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. తాడిపత్రి నియోజకవర్గంలో పెట్టుబడి సాయం కింద 74 వేల మంది రైతులకు రూ.99 కోట్లను అందజేసింది. రైతుకు రూ.13,500 చొప్పున మంజూరు చేయడంతో రైతులకు కొంత మేర లబ్ధి చేకూరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా కంటే అదనంగా రూ.6,500 చొప్పున రైతుకు రూ.20 వేలు అన్నదాన సుఖీభవ కింద పెట్టుబడిని అందచేస్తామని టీడీపీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 2024 సంవత్సరంలో రైతులకు పంగనామాలు పెట్టింది. ఈ ఏడాదిలోనైనా పెట్టుబడి సాయంపై కూటమి ప్రభుత్వం రైతుల అర్హుల జాబితా వెరిఫికేషన్ పేరుతో హడావుడి చేస్తోంది. ఎప్పుడు వెరిఫికేషన్ పూర్తి అవుతుందో.. ఎన్నాళ్లకు రైతుల అకౌంట్లకు సాయం పడుతుందో తెలియని పరిస్థితి. ఈ ఏడాది అరకొర పెట్టుబడి సాయంతో చేతులు దులుపుకుంటారా లేక మాయమాటలతో మతడపెడతారా అన్న సందేహాలు కూడా రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

భారంగా మారిన వ్యవసాయం

పెరిగిన విత్తనాల ధరలు, ఎరువులు, పురుగుల మందులు ధరలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి. సాగు, కూలీల ఖర్చులు కూడా అమాంతం పెరిగాయి. వీటన్నింటిని దాటి పంటలను సాగు చేయాలంటే ఎంత వరకు దిగుబడి చేతికి వస్తుందన్న ఆశ కూడా పూర్తిగా లేదు. తాడిపత్రి ప్రాంతంలో గతంలో ఎక్కువగా వేరుశనగ పంటను సాగు చేసే వారు. వాతావరణ పరిస్థితుల కారణంగా గతంలో కంటే తక్కువగా పంటలు సాగు చేస్తున్నారు. కేవలం వేరుశనగ పంట సాగు కోసం ఎకరాకు రూ.15 వేలు నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం, పంట నష్టపోతే ఇన్సూరెన్స్‌ల ద్వారా రైతులకు అండగా ఉంటే కొంత వరకు ఉపశమనం కలిగేది. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించే పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి భరోసా లేకపోవడంతో రైతులు దేవుడిపై భారం వేసి పంట సాగుకు ముందుకు కదులుతున్నారు.

విత్తనాల సరఫరా జరిగేనా?

తాడిపత్రి ప్రాంతంలో సాగు చేసే వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలను డిమాండ్‌కు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రైతులకు అందచేస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగు చేస్తున్నారు. గత ఏడాది రైతుల డిమాండ్‌కు అనుగుణంగా రాయితీ విత్తనాలను సరఫర చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం 40 శాతం సబ్సిడీతో విత్తనాల సరఫరా చేస్తామంటూ చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏ మేరకు విత్తనాలు అందజేస్తుందో తెలియడం లేదు.

మంచి చేస్తారని ఓట్లు వేశాం



రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఓట్లు వేశాం. తీరా గత ఏడాదికి సంబంధించిన పెట్టుబడి సాయం నేటికి అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి మోసం చేశారు. 2024లో ఎదురు చూసినా ఇవ్వలేదు. ఈ ఏడాది అయినా వస్తుందన్న ఆశతో ఉన్నాం. మా ఆశలను కూటమి ప్రభుత్వం నేరవేర్చుతుందో లేదో చూడాలి.

– ఓబుళ క్రిష్ణయ్య, ఓబుళాపురం

జేడీఏ కార్యాలయానికి పంపాం



తాడిపత్రి ప్రాంతంలో ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు సంబంధించిన విత్తనాల డిమాండ్‌పై అంచనాలు తయారు చేసి జేడీఓ కార్యాలయానికి పంపాం. ఆయా మండలాలకు చెందిన వ్యవసాయాధికారుల నుంచి అంచనాలను తీసుకున్నాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విత్తనాలను అందజేస్తాం.

– చెంగళరాయుడు, ఏడీఏ

నిబంధనలు పాటించకుంటే చర్యలు



తాడిపత్రి రూరల్: తినుబండారాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రజాక్‌వలి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పలు సినిమా థియేటర్లను బుధవారం తహసీల్దార్ రజాక్‌వలి, సిబ్బంది కలిసి తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాయితేజ, లక్ష్మీనారాయణ, దాదా సినిమా థియేటర్లలోని తిరుబండారాలు, బాత్‌రూంలను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.

గుత్తి: పట్టణంలోని సినిమా థియేటర్లను బుధవారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ప్రభుత్వం సినిమా థియేటర్లను తనిఖీ చేసి సదుపాయాలపై రిపోర్టు ఇవ్వాలని జీఓ జారీ చేసింది. తహసీల్దార్ ఓబులేసు, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, వీఆర్వో సురేంద్ర అమృత్, కేపీఎస్ సినిమా థియేటర్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి.. క్యాంటీన్, బాత్ రూమ్‌లు, సీట్లను పరిశీలించారు. అనంతరం సినిమా థియేటర్ల లైసెన్స్‌లను పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీజు ఓనర్ రాజేష్, మేనేజర్లు దాదా ఖలందర్, అమీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యాడికి ఉన్నత పాఠశాలలో యోగా సాధన చేస్తున్న మండల అధికారులు



గుత్తి రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న దృశ్యం



గార్లదిన్నెలో యోగాపై శిక్షణ పొందుతున్న సిబ్బంది

యాడికి: యోగ సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహసీలార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని, మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తుందన్నారు. వచ్చే నెల 21 వరకు యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కాశెప్ప పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ప్రతి ఒక్కరూ రోజూ యోగా ఆచరించి ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, యోగా శిక్షకుడు కృష్ణయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు కార్యాలయ ఉద్యోగులు, ప్రజలకు యోగా ఆసనాలను వేయించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. జూన్ 3 వరకూ గ్రామీణ ప్రాంతాల వారికి యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. ముఖ్యంగా యోగా ప్రాముఖ్యతను యువతకు వివరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ రోజూ యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా శిక్షకులు యోగాసనాలు, వాటి ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నెలో..

గార్లదిన్నె: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం సమీపంలోని టీ కన్వెన్షన్ హాల్లో గ్రామ సచివాలయ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి, మహిళ సంఘాల సభ్యులకు యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. యోగా వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ తరగతులు నిర్వహించారు.

యోగా సాధనతో ప్రయోజనాలు..

పెద్దవడుగూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ యోగా చేయడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎంపీడీఓ బాషాసాహెబ్, ఎంఈఓ రాముడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఫంక్షన్ హాల్ ఆవరణంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగా చేయడం వలన దేహధారుడ్యం పెరగడంతో పాటు, మేథోశక్తిని పెంచుకోవచ్చన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే యోగా సాధన అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ వరప్రసాద్, రెవెన్యూ , ఆరోగ్య సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడిలో..

పామిడి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కె.తేజోత్స్న అన్నారు. బుధవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శ్రీధరమూర్తి, ఆయుష్ వైద్యాధికారి జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆస్పత్రులను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులను మరింత బలోపేతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సీపీఐ నాయకుల బృందం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించింది. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. వైద్యం కోసం ఇక్కడికి వచ్చే రోగులకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటూ నర్సులు, సెక్యూరిటీ గార్డులు సలహా ఇస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని ఆరోపించారు. దీని ఫలితంగా రోజూ 800కు పైగా వచ్చే ఓపీ సంఖ్య ప్రస్తుతం 400కు పడిపోయిందన్నారు. అంతేకాకుండా 100 పడకల ఉన్న కేవలం 50 పడకలను మాత్రమే ఉపయోగంలో పెట్టడం తక్కిన వాటిని మూలకు పడేశారని విమర్శించారు. ఇక పేషంట్లున్న బెడ్‌లపై కవర్లు, బెడ్‌షీట్లు ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రోగులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తే ప్రభుత్వ ఆస్పత్రిల్లో పని చేసే కొంతమంది కమీషన్లకు ఆశపడి పడి రోగులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆర్డాటీ సంస్థ ఉచిత వైద్యం అందిస్తూ రోగులతో సిబ్బంది మమేకమై నాణ్యమైన వైద్యం అందిస్తూ ఏ విధంగా ప్రజలు మన్ననలు పొందుతున్నారో అ తరహాలో మీరు కష్టపడి ప్రభుత్వ వైద్యం మెరుగుపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న వైద్యులను డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపుతున్నారన్నారు. ఇక్కడ గుండె వైద్య నిపుణులు, అంబులెన్స్‌లు లేవని పేర్కొన్నారు. 28 మంది నర్సులు పని చేయాల్సిన చోట కేవలం 10 మంది మాత్రమే ఉన్నట్లు తెలిపారు. కరోనా విస్తరిస్తున్న సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిల్లో ఖాళీగా అన్ని వైద్య పోస్టులను భర్తీ చేయాలన్నారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు, కాంట్రాక్ట్ కార్మికులకు నెలనెలా వేతనాలు అందేలా ప్రభుత్వ చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, రాము రాయల్, రామాంజనేయులు, ఎస్ఎండీ గౌస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న వెంకటరమణ

పెద్దపప్పూరు: విద్యుత్ స్తంభాల మీదుగా లాగిన టీవీ కేబుల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో వెంకటరమణ అనే యువకుడు గాయాల పాలయ్యాడు. వివరాలు.. మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన వెంకటరమణ పశుసంవర్ధక శాఖలో గోపాలమిత్రగా పని చేస్తున్నాడు. బుధవారం తన పని ముగించుకుని పొలానికి బయలుదేరాడు. చాగల్లు–పెద్దపప్పూరు రోడ్డు మార్గంలోని గోదాం వద్ద టీవీ కేబుల్ తలకు అందే ఎత్తులో ఉండటంతో తొలుత ఆ కేబుల్‌ను దాటుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ కేబుల్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో వెంకటరమణ చేతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ నరసింహులును సంప్రదించగా.. టీవీ కేబుల్‌కు సపోర్ట్‌గా ఏర్పాటు చేసిన ఇనుప తీగకు విద్యుత్ సరఫరా కావడం వల్లే ఈ ఘటన జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అదృష్టవశాత్తూ వెంకటరమణ ప్రాణాలతో బయటపడ్డాడని గ్రామస్తులు పేర్కొన్నారు.



ప్రమాదకరంగా ఉన్న గుంత

ఆదమరిచారో అంతే..

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రహరీకి ఆనుకున్న ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతులు. ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. చుట్టు పక్కల నిలిచిన వర్షపు నీరు ప్రభుత్వ కళాశాల మైదానంలోకి వెళ్లేందుకు వీలుగా కళాశాల ప్రహరీకి పెద్ద రంధ్రం చేసి అక్కడి నుంచి కాలువ తీశారు. అక్కడ పెద్ద గుంత ఏర్పడటంతో ప్రమాదకరంగా తయారైంది.

పుస్తక పఠనంతో విజ్ఞానం

గార్లదిన్నె: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారిణి శిరీష పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులలో కథలు చదివించడం, కథలు చెప్పించడం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. చెస్, కేరమ్స్, లూడో ఆటలు నేర్పించడం జరిగిందన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోందని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిని ఢీకొన్న ఆటో

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో కోళ్ల ఫారం వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కుళ్లాయి స్వామి రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుళ్లాయి స్వామిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి

గుత్తి/గుంతకల్లుటౌన్: గుత్తి, గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం మాజీ సీఎం ఎన్‌టీ రామారావు జయంతి నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, కమిషనర్ జబ్బార్ మియా, ఏసీడీపీఓ నాగమణి, ఎంఈఓ రవి నాయక్, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పెన్షనర్ల సంఘానికి బుధవారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు కరుణాకర్ రూ.10 వేలు విరాళంగా అందజేసినట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దపొలమడ హైస్కూల్‌లో పని చేసిన కరుణాకర్ పెన్షనర్ల సంఘం చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు స్పందించి విరాళం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మట్కా రాస్తున్న అవినాష్, రామును బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొద్ది రోజులుగా చేనేత కాలనీ సమీపంలో మట్కా రాస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. బీటర్ల నుంచి చీటీలు, రూ.16,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు నరసింహ స్వామి కల్యాణం



అలంకరణలో నవ అహోబిల నరసింహుడు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన నవ అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈనెల 30న శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో వేకువజాము నుంచి స్వామికి అభిషేకాలు, అర్చనలు, మండల పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకోవాలని సూచించారు.

‘ఉపాధి’ పనుల తనిఖీ

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు, తక్కళ్లపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ పుల్లారెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పని ప్రదేశాల్లో మస్టర్లను తనిఖీ చేసి పనుల నాణ్యతపై ఆరా తీశారు. పనులకు హాజరయ్యే వారి పేర్లు మాత్రమే మస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ఒకరికి బదులుగా మరొకరు పనులకు వస్తే అనుమతించొద్దని తెలిపారు. బాల కార్మికులు పనికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



చింతలాయపల్లిలో నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

యాడికి: మండలంలోని చింతలాయపల్లి గ్రామంలో వారం రోజుల క్రితం నీటి మోటార్ మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంబాయి రమేష్ నాయుడు బుధవారం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయించారు. గ్రామ ప్రజలకు నీరు అందించడంతో బొంబాయి రమేష్ నాయుడుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.